



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

‘టిడ్కో’ గతి మారేనా.?

- మౌలిక వసతులు కరువు
- నివాసానికి అననుకూల వాతావరణం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వాలని టిడ్కో ఇళ్లు ఇచ్చినా ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. నివాసానికి అనానుకూల వాతావరణం ఉండటంతో లబ్ధిదారులు వాటిలో ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. టిడిపి కూటమి ప్రభుత్వంలో టిడ్కో పరిస్థితి మారుతుందా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు..

పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న ఉద్దేశంతో టిడిపి ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో టిడ్కో గృహాల పేరుతో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. తరువాత ప్రభుత్వం మారడంతో అవి అలానే ఉండిపోయాయి. వైసిపి ప్రభుత్వం వాటిని లబ్ధిదారులకు ఇచ్చేందుకు ఆర్భాటంగా కార్యక్రమాలు నిర్వహించింది. ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టింది. కర్నూలు జిల్లా పరిధిలో కర్నూలు నగరంలోని జగన్నాథగట్టుతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. కర్నూలు నగరంలోని జగన్నాథగట్టు వద్ద 10 వేల గృహాల నిర్మాణం చేపట్టారు. ఆ టిడ్కో ఇళ్లను జగనన్న నగర్‌గా నామకరణం చేసి గతంలో మున్సిపల్, ఆర్థిక, కార్మిక శాఖ మంత్రులు ప్రారంభించారు. కర్నూలులో నిర్మించనున్న 10వేల ఇళ్లలో 300 చదరపు అడుగులకు సంబంధించి 3,888 ఇళ్లు, 365 చదరపు అడుగులకు సంబంధించి 19,04 ఇళ్లు, 430 చదరపు అడుగులకు సంబంధించి 4,208 ఇళ్లు నిర్మించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం వాటిలో 4,500 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వాటిని లబ్ధిదారులకు ఇచ్చే కార్యక్రమాన్ని గతంలో మంత్రులు చేపట్టారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇళ్లలోనూ సగానికి పైగా వాటిలో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించలేదు. ఫ్యాన్లు, లైట్లు వంటి పనులు ఇంకా పూర్తి కాలేదు. చాలా వాటికి కిటికీల అద్దాలు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. ఆదోనిలోని సిరిగుప్ప రోడ్డులో 4704 గృహాలను నిర్మించారు. కొన్నింటిలో ఫ్లోరింగ్, మరికొన్నింటిలో పెయింటింగ్, ఇంకా కొన్ని వాటిలో లైట్లు లేవు. 2వ విడతలో మంజూరైన 3500 ఇళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిన తరువాత ప్రభుత్వం మారడంతో ఆ గృహాలను పూర్తిగా రద్దు చేశారు. టిడ్కో గృహ సముదాయాల పరిసరాల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదు. నీటి సౌకర్యం కూడా కల్పించలేదు. ఎమ్మిగనూరులో శివన్న నగర్‌లో 2240, మైనార్టీ కాలనీలో 1024 ఇళ్లను ఇప్పటి వరకూ పూర్తి చేశారు. రెండో విడతలో మంజూరైన ఇళ్లు పునాదులకు పరిమితం కాగా మూడో విడతలో మంజూరైన1796 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభమే కాలేదు. మైనార్టీ కాలనీలో నీటి కోసం నిర్మిస్తున్న ఓవర్ హెడ్ ట్యాంక్ అసంపూర్తిగా ఉంది. గృహాల మధ్య ముళ్ల కంపలు ఏపుగా పెరిగాయి. సిసి రహదారులు పగుళ్లు ఇచ్చి కుంగిపోయాయి.

నంద్యాల జిల్లా పరిధిలో నంద్యాలతో పాటు ఆళ్లగడ్డ, డోన్‌లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నంద్యాలలోని నందమూరి నగర్‌లో 3,904 ఇళ్లు, అయ్యలూరి మెట్ట దగ్గర 2,272 ఇళ్లు, ఎస్ఆర్‌బిసి కాలనీలో 3,824 ఇళ్లను నిర్మించారు. ఆళ్లగడ్డలో చింతకుంట గ్రామ శివార్లలో 1,296 ఇళ్లు, డోన్‌లో హైవే సమీపంలో 306 ఇళ్లను కట్టించారు. ఎక్కడా కూడా లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఈ ఇళ్లకు విద్యుత్, మంచినీటి సైకర్యం, రోడ్లు, డ్రైనేజీ వంటివి ఏర్పాటు చేయలేదు. ఇళ్లు కూడా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. పూర్తి అయిన ఇళ్లను కరోనా సమయంలో క్వారంటైన్ కేంద్రాల కోసం ఉపయోగించడంతో ప్రస్తుతం అవి



నివాసానికి అనుకూలంగా లేవు. టిడ్కో గృహాలు నివాసానికి అనుకూలంగా లేకపోవడంతో లబ్ధిదారులు వాటిలో నివాసం ఉండేందుకు ఆసక్తి చూపడం లేదు. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టిడ్కో గృహాల పరిస్థితిని మార్చి లబ్ధిదారులకు అనుకూలంగా తయారు చేస్తారా అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

అద్దె ఇళ్లే దిక్కు..

ప్రభుత్వం టిడ్కో గృహాల పేరుతో ఇళ్లను కేటాయించినా వాటిలో మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు వెళ్లకపోవడంతో అద్దె ఇళ్లే దిక్కవుతున్నాయి. నెలకు రూ.4 నుంచి రూ.5 వేల ఇంటి అద్దె కట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరో వైపు టిడ్కో గృహాలకు బ్యాంకులు ఇచ్చిన రుణాలను కూడా కొందరు లబ్ధిదారుల నుంచి వసూలు చేస్తుండటంతో ఆయా లబ్ధిదారులకు భారం రెట్టింపవుతోంది.

సిఎంఒ గ్రీవెన్స్‌పై దృష్టి పెట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేట్

ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన గ్రీవెన్స్ పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ద్వారా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి జిల్లాకు సంబంధించి 94 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 23 పరిష్కారం కాగా 71 పెండింగ్ ఉన్నాయని, వీటికి త్వరితగతిన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆయా శాఖల్లో గడువు దాటినా పరిష్కారం చూపని అర్జీలు, రీఓపెన్ అర్జీలపై కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ ఆర్జీల పరిష్కారాన్ని తేలిగ్గా తీసుకోవద్దని ఆయా శాఖల అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చట్టపరంగా న్యాయం చేస్తాం : ఎస్‌పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదులపై విచారణ చేపట్టి చట్టపరంగా న్యాయం చేస్తామని కర్నూలు జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ అన్నారు. కర్నూలు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 97 ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సిఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.



ఎస్‌పికి సమస్యను విన్నవిస్తున్న బాధితురాలు

ఒడ్లోని వంక ఆక్రమణదారులపై

చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కల్లూరు మండలంలోని పెదపాడు గ్రామంలో వడ్లోని వంకను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రామకృష్ణ సిపిఎం మండల కార్యదర్శి కె.మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషకు వినతి పత్రం అందజేశారు. జి రామకృష్ణ మాట్లాడుతూ పెద్దపాడు గ్రామం కర్నూలుకు సమీపంలో ఉన్న పెద్ద గ్రామమని, అంతేకాక మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సొంతూరని, ఇటువంటి గ్రామంలో ప్రజలు కనీస సౌకర్యాలు కూడా నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ వారు యథేచ్ఛగా ఆక్రమించి ప్రజలకు ఎంతో నష్ట కష్టాలు తెస్తున్నారన్నారు. ఏళ్లతరబడి వంక పోరంబోకు భూమిని వదిలి పెట్టాలని అనేక ఆందోళనలు పోరాటాలు నిర్వహించినప్పటికీ వారికి ఉన్న రాజకీయ పలుకుబడితో వంక పోరంబోకు భూమిని ఆక్రమించుకున్నారన్నారు. ప్లాట్లు వేసుకుని ఏథేచ్ఛగా అమ్ముకుంటున్నారన్నారు. 2022 సంవత్సరంలో వర్షం వచ్చిన సందర్భంగా 130 దళితుల ఇండ్లు తడిసి ముద్దయినాయని, స్కూల్లోకి హాస్టల్లోకి నీళ్లు ప్రవేశించి సరుకులన్నీ తడిసిపోయిన పరిస్థితిని కలెక్టరుకు వివరించారు. వంకన అనుకుని దళితపేట ఉండడం వలన దళితవాడ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. విష కీటకాలు,పాములు తేళ్లు నిరంతరం స్వైర విహారం చేస్తున్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం స్పందించిన జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులకు దీనిపై వెంటనే సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించారు. అక్కడికి వెంటనే పంపించి విచారణ చేయిస్తామని ఇరిగేషన్ అధికారులు కూడా పేర్కొన్నారు.



కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

హెల్త్ సెక్రెటరీలను కొనసాగించాలి

- కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

గ్రామ వార్డు హెల్త్ సెక్రటరీలను వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకుని వస్తూ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని ఎపి యునైటెడ్ విలేజ్ అండ్ వార్డ్ హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఉషా) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సంధ్యారాణి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ సంధ్యారాణితో పాటుజిల్లా గౌరవ అధ్యక్షులు ఎండి అంజిబాబు, జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి వినతిపత్రం అందజేశారు. ఫీల్డ్ వర్క్ చేయాల్సి ఉన్నందున హెల్త్ సెక్రటరీలకు బయోమెట్రిక్ నుండి వెసులుబాటు కల్పించాలన్నారు. మాతా శిశు సంరక్షణ సేవలను (యానిమల్ ఆర్‌సిహెచ్, యువిన్‌న్) మూడు యాప్‌లలో లోడ్ చేయాల్సి వస్తుందని ఈ మూడింటిని ఒకే యాప్‌లో ఒకేసారి చేసే విధంగా వెసులుబాటు కల్పించాలన్నారు. హెల్త్ సెక్రటరీలకు సాధారణ బదిలీలను కల్పించాలని కోరారు.



కలెక్టర్ రంజిత్‌బాషాకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జిజి హెచ్‌లో 4 ఎక్స్‌రే మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్ రేడియాలజీ విభాగంలో 4 ఎక్సరే మిషన్ల , ఒక సి.ఆర్.రీడర్ ప్రింటర్ ఏర్పాటు చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూడయాగ్నొస్టిక్ బ్లాక్ రేడియాలజీ విభాగంలో 4 ఎక్సరే మిషన్‌లు అందులో (రెండు ఎక్రే 500 ఎం ఎ ఎక్రే మిషిన్లు , రెండు 300 ఎం ఎ ఎక్రే మిషిన్లు) ,ఒక సిఆర్‌రీడర్ ప్రింటర్‌లను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ మిషన్ల ద్వారా పేషెంట్లకు తొందరగా ఎక్సరే తీయడం జరుగుతుందని అన్నారు. ఇంతకు ముందు ఐదు ఎక్సరే ప్లాంటు విభిన్న చోట్లలో ఉన్నాయని, ఇవే కాకుండా మరొకటి డిజిటల్ ఎక్సరే మిషన్ ఉందని అన్నారు. ఆసుపత్రిలో ఇప్పటివరకు 9 ఎక్సరే ప్లాంట్లు ఉన్నాయన్నారు. ఈరోజు నాలుగు ఎక్సరేప్లాంట్లు ప్రారంభించడం ద్వారా త్వరగా ఎక్సరే తీయడానికి వీలుంటుందని తెలిపారు. గతంలో ఆసుపత్రిలో కరెంటు సమస్యలు ఉన్న నేపథ్యంలో వీటికి కూడా సమస్యల లేకుండా పూర్తిగా చేసి న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్‌కు ఎటువంటి పవర్ ప్రాబ్లం లేకుండా అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు చేశామన్నారు. దీని ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఆసుపత్రిలో నిన్ననే అర్థింగ్ కేబుల్ కూడా ఏర్పాటు చేయడం, దీనివల్ల మిషిన్లు చెడిపోకుండా ప్రొటెక్షన్ చేస్తుందని తెలిపారు. రేడియాలజీ విభాగపు వైద్యులు పలు ఎక్సరే క్యాసెట్లు కావాలని అడిగారని, దానికి సానుకూలంగా స్పందిస్తూ త్వరలో వారికి రూ.8 లక్షల విలువగల 10 ఎక్సరే క్యాసెట్లకు ఈరోజు కొటేషన్ తెప్పిచ్చి పది రోజుల్లో దాతల సహకారంతో వారికి అందిస్తానని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలతో నాలుగు ఎక్సరే మిషన్లు ప్రారంభించడం ద్వారా రేడియాలజీ విభాగానికి , పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని, దీని ద్వారా కొంతమేర రేడియాలజీ విభాగానికి లోడు తగ్గుతుందని అన్నారు. ఒకేచోట ఇన్వెస్టిగేషన్ ఉండడం వల్ల పేషెంట్లకు చికిత్స అందించడంలో తోడ్పాటు అవుతుందని తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు చేయడమే నా లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, రేడియాలజీ హెచ్ఒడి డా రాధారాణి, ప్రొఫెసర్ డాక్టర్ పద్మలత, డాక్టర్ హరినాథ్, ఎఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నగాంజన్, డాక్టర్ సునీల్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి

పత్తికి గులాబీ రంగు పురుగు బెడద

ప్రజాశక్తి- సి బెళగల్ : సిబెళగల్ మండలంలోనీ ఆయా గ్రామాల్లో పత్తి పంటకు గులాబీ రంగు పురుగు విస్తరించింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడే ఏఓ మల్లేష్ కుమార్ సోమవారం చింతమానుపల్లె, సంగాలలో పంటలను పరిశీలించారు. నివారణలో భాగంగా ఎకరాకు ఐదు నుండి పది లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పిచికారీ చేయుటలో వ్యవసాయ సిబ్బంది సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని విధుల్లో అలసత్వం ఏ మాత్రం తగదని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంధ్య, ప్రవీణ్ రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందించాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఇవాళ తెలంగాణలోని మానపాడు గ్రామ సమీపంలో ఆటోలో ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 14 మంది కూలీల కుటుంబాలను ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని సిపిఎం కర్నూలు మండల కార్యదర్శి హుస్సేనయ్య, తాండ్రపాడు సర్పంచు పి.బాలపీర డిమాండ్ చేశారు. సోమవారం వారు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఈ తాండ్ర పాడు గ్రామానికి చెందిన నిరుపేద కూలీల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుండి వెంటనే వారికి ఆర్థిక సాయం చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపిటిసి మహబూబ్ బాషా, తెలుగు లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు కూడా ఉన్నారు.

టమోటా పంటకు తెగుళ్లు

ప్రజాశక్తి-పత్తికొండ : టమోటా పంటకు తెగుళ్లు సోకడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పత్తికొండ మండలంలోని ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్లో కొన్ని వేల హెక్టార్లలో టమోటా పంటను సాగు చేస్తారు. జూన్, జులై, ఆగస్టు నెలల్లో రైతులు టమోటా పంట సాగు చేస్తారు. టమోటా పంటకు ఎర్ర తెగుళ్లు ,బూడిద తెగుళ్లు ,టమోటా మొక్క ఎదుగుదల లేక పోవడంతో రైతులు ఏం చేయాలో దిక్కు తోచక దీనస్థితిలో ఉండిపోయారు. రైతులకు టమోటా పంటపై సూచనలు, సలహాలు ఇవ్వడంలో పూర్తిగా విఫలం చెందారని రైతు సంఘం నాయకులు మండిపడుతున్నారు. మండల వ్యవసాయ, రైతు భరోసా అధికారులు మండలంలో ఉన్నట్లా లేనట్లా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళా చట్టాలను నటిష్టం చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేసి, మహిళలకు భద్రత కల్పించాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాయలసీమ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో యూనివర్సిటీ విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీ చేసి విశ్రాంతి తీసుకునే సమయంలో ఒక ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం చేయటం సమాజానికి సిగ్గుచేటని అన్నారు. ట్రైనీ డాక్టర్ పై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్, అశోక్, భరత్, రాజేష్, జోష్, అమర్, రాజు, రవి, తేజ, ప్రకాష్, డెవిల్, శరత్, కుమార్, ప్రవీణ్, రతీశ్, జనార్ధన్, వేణు, వివేక్, వెంకట్, వెంకీ, దినేష్, సుభాష్,అదిశేషు,విద్యార్థులు పాల్గొన్నారు.

జటిలమవుతన్న పారిశుధ్య కార్మికుల సమస్య

పాతవారుండాలని వైసిపి, కొత్తగా తీసుకోవాలని టిడిపి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుల సమస్య టిడిపి,వైసిపి మధ్య రాజుకుంటుంది. గత కౌన్సిల్ సమావేశంలో కర్నూలు నగర పాలక సంస్థ విస్తీర్ణం పెరిగి నివాసాలు పెరగడంతో పారిశుధ్య పనులు చేసేందుకు కావలసిన కార్మికులు తగినంత లేకపోవడంతో కర్నూలు నగరం చెత్త మయమైంది. కార్మికుల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని 200 మంది కార్మికులను తీసుకోవాలని కౌన్సిల్ తీర్మానం చేసింది. గతంలో సిల్టుతీసేందుకు 180 మంది కార్మికులను తీసుకొని పనిచేయించుకున్నారు. వారి కాలపరిమితి పూర్తి అవడంతో వారిని తొలగించారు. వారి స్థానంలో మళ్లీ తీసుకునే 200 మందిలో గతంలో పనిచేసిన వారిని తీసుకోవాలని వైసిపి వర్గానికి చెందిన మేయర్ బి వై.రామయ్య కార్పొరేటర్లు పట్టు పట్టారు. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వంలో పరిశ్రమల ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టిజి. భరత్ తమ వారు ఉండాలని 132 మంది లిస్టును పంపారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు సంబంధించిన 57 మంది ఉండాలని లిస్ట్ పంపారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి 11 మంది కార్మికుల పేర్లు పంపారు. మొత్తం 200 మంది కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని కమిషనర్ పివి.రామలింగేశ్వర్‌ను ఆదేశించారు. ఆయన వెంటనే హెల్త్ ఆఫీసర్‌కు ఆ లిస్టును పంపి కార్మికులను పనిలోకి తీసుకోవాలని ఒత్తిడి చేయడంతో ఇటు అధికారులకు అటు నాయకులకు చెప్పుకోలేక వదలమంటే పాముకుకోపం , కరవమంటే కప్పకు కోపం అన్న చందంగా అధికారులు ఉంటూ ఒత్తిడికి తట్టుకోలేక సెలవులపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ వ్యవహారం తెలిసిన వెంటనే మేయరు కార్పొరేటర్లు ప్రెస్ మీట్ పెట్టి గతంలో పనిచేసిన వారు కడు పేదవారిని తీసుకున్న తర్వాత మిగతా వారిని కొత్తవారిని తీసుకోవాలని సూచించారు. మీ ప్రభుత్వంలో మీ వారిని తీసుకున్నారు కదా మా ప్రభుత్వంలో మావారిని తీసుకుంటే తప్పేమిటి అని టిడిపి వాళ్లు ప్రశ్నిస్తున్నారు.



టిడిపి కార్పొరేటర్లు వెను వెంటనే అదే కార్పొరేషన్ వద్ద ప్రెస్ మీట్ పెట్టి టిజి. భరత్ ను ప్రశ్నించే హక్కు బివై .రామయ్యకు లేదంటూ కార్మికులను వెంటనే పనిలోకి పెట్టుకొని నగరాన్ని చెత్త లేని నగరంగా తీర్చిదిద్దాలని ఒత్తిడి చేస్తున్నారు. నగరపాలక సంస్థలో పాలకమండలి ఉంది పాలకమండలి తీర్మానం లేకుండా కార్పొరేటర్ల ప్రమేయం లేకుండా టిజి. భరత్ జోక్యం చేసుకోవడం సరైంది కాదని మాటల యుద్ధం నడుస్తుంది. ఇరు పార్టీల నాయకుల మధ్య కమిషనర్‌గా ఉన్న పివి రామలింగేశ్వర్ ఎటు చెప్పలేక నలిగిపోతున్నాడు. ఈ క్రమంలో కొత్తగా కర్నూలు కమిషనర్ గా జి.విద్యాధరిని ప్రభుత్వం నియమించింది. ఆమె వచ్చి ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించి ఇరు పార్టీల మధ్య సఖ్యత ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ

- మాజీ ఎమ్మెల్యే ఎంఏ హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

అన్నాచెల్లెల్ల ప్రేమానురాగాలకు సూచనగా రాఖీ నిలుస్తుందని కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. కర్నూలు నగరంలోని స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు వైసిపి మహిళా నాయకులు కాశిరెడ్డి శ్వేతా, వెంకటేశ్వరమ్మ, స్వరూప, మంజులత, కల్పన తదితరులు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ మాట్లాడుతూ రక్షా బంధన్ అన్నా చెల్లెల్లు, అక్కా తమ్ముళ్ళు జరుపుకునే మహోత్తరమైన పండుగ అన్నారు. ఈ సందర్భంగా రాఖీ కట్టిన మహిళా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సాయి సుబ్బయ్య రవీంద్ర విద్యాసంస్థలో...

కర్నూలు కలెక్టరేట్ : మాధవినగర్‌లోని రవీంద్ర ఇంగ్లీషు మీడియం స్కూలు, రెవెన్యూ కాలనీ రవీంద్ర టాలెంట్ స్కూల్స్‌లో కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య ఆధ్వర్యంలో సోమవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. కరస్పాండెంట్ పిబివి సుబ్బయ్య మాట్లాడుతూ కాలం మారినా, దూరం పెరిగినా, చెరిగిపోని అందమైన అనుబంధం, అంతులేని అనురాగం అన్నా చెల్లెలు అక్కా తమ్ముళ్ల బంధం అని తెలిపారు. పురాణాల ప్రకారం శ్రీకృష్ణుడు, ద్రౌపది అన్నా చెల్లెళ్ల అనుబంధం గురించి వివరించారు. పురుషోత్తముడు, అలెగ్జాండర్ భార్య రుక్సానాల సోదరీ, సోదరుల ప్రేమను విద్యార్థులకు వివరంగా తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులతో రాఖీ కట్టించి వారిలో సోదర, సోదరీ భావం పెంపొందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం

ప్రజాశక్తి - కర్నూలు జిల్లా పరిషత్

నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం పారుమంచాలలో బుడమాకు తిని 20 గొర్రెలు మరణించాయని, ప్రభుత్వం ఆ గొర్రెల కాపరులను ఆదుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.కే.రంగస్వామి, నందికొట్కూరు మండల కురువ సంఘము అధ్యక్షులు అల్లూరు వెంకటేశ్వర్లు, ఓర్వకల్ మండల కురువ సంఘము అధ్యక్షులు అల్లబాబు, కురువ మహేష్, రామయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు పారుమంచాల గ్రామంలో నష్టపోయిన గొర్రెల కాపరుల నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎం.కే.రంగస్వామి మాట్లాడుతూ గొర్రెల పెంపకమే ప్రధాన వత్తిగా నమ్ముకొని జీవిస్తున్న కురువ శ్రీనివాసులు, కురువ కృష్ణ, కురువ మల్లయ్య, కురువ లింగన్నలు దాదాపు రూ.3 లక్షల విలువచేసే గొర్రెలు మరణించడంతో ఉపాధి కోల్పోయారని, కాబట్టి ప్రభుత్వం వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేసారు.

ఇంటి స్థలాలకు ప్లాట్ నంబర్లు వేయాలి: సిపిఎం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నన్నూరులోని రెండో విడత జగనన్న కాలనీలో ఇంటి స్థలాలకు వెంటనే ప్లాట్ నెంబర్లు వేయాలని సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ వెంకటరమణను సిపిఎం ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం అందజేసింది. మండల కార్యదర్శి బి నాగన్న మండల నాయకులు ఎస్.మధుసూదన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నన్నూరు గ్రామంలో సర్వేనెంబర్ 1338/ఎ2లో గత సంవత్సరం ఇంటి స్థలాలు లేని పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసిందన్నారు. లేఅవుట్ వేసి, రోడ్లు, నెంబర్ రాళ్లు పాతీ అభివృద్ధి చేశారని ప్లాట్లకు నంబర్లు వేయకుండా వదిలేసారన్నారు. తహశీల్దార్ స్పందిస్తూ సర్వేయర్‌తో చర్చించి తక్షణమే ప్లాట్లకు నెంబర్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాసుంబాష, వెంకటేశ్వర్లు, ఆకుల మధు, వాయిద్ బాష తదితరులు పాల్గొన్నారు.

డప్పు గురువు చిన్న మద్దిలేటి మృతి

- ఎపి డప్పు కళాకారుల సంఘం

రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ బాబు నివాళి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో అనారోగ్యంతో డప్పు గురువు జె చిన్న మద్దిలేటి సోమవారం మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యం డి ఆనంద్ బాబు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యాలతో పిట్టల్లా రాలిపోతున్న డప్పు కళాకారుల బతుకు భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సాంప్రదాయ వృత్తి కళాకారులుగా ఉన్న డప్పు కళాకారులకు వృత్తి అవకాశాలు లేక పోవడం ఒకటైతే ఆర్థిక హీనత, సరైన పౌష్టికాహారం లేకపోవడం, పరిసరాల అపరిశుభ్రత తో రోగాల రొప్పులతో జీవిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. అందుకే 40 సంవత్సరాలు ఉండే దళితులైన డప్పు కళాకారులు 60 సంవత్సరాల వయసు మీదపడ్డ వాళ్ళ లాగా కృంగిపోతారన్నారు. ఈ కారణంగానే నాడు 50 సంవత్సరాలకే పెన్షన్‌ను పోరాడి సాధించుకున్నామన్నారు. పెన్షన్ వయసును 45 సంవత్సరాలకే తగ్గించడంతో పాటు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని డప్పు కళాకారుల బతుకు భరోసా కోసం ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డప్పు గురువు మద్దిలేటితో పాటు నందవరం మండలం చిన్న కొత్తలిలో ఎస్ ఆదాము అనే మరో డప్పు కళాకారుడు అనారోగ్యంతో మరణించారన్నారు. ఈ రెండు కుటుంబాలను ఆదుకోవాలన్నారు. డప్పు గురువు మద్దిలేటి కుటుంబానికి డప్పు సంఘంగా రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు జరదొడ్డి మద్దిలేటి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజయమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, ఎపిడికెయస్ జిల్లా నాయకులు చక్రపాణి, మాదన్న, నాగరాజు, జమ్మన్న, మద్దయ్య, వెంకటేశ్వర్లు, చిరంజీవి, నాగ శేషులు, ప్రదీప్ పాల్గొన్నారు.



- ఆర్డిటి, ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మానవహారం

హత్యాచార నిందితులను ఉరి తీయాలి

- ఆర్డిటి, ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మానవహారం

ప్రజాశక్తి - చిప్పగిరి



కోల్‌కతాలో వైద్య విద్యార్థిపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను వెంటనే ఉరితీయాలని విద్యార్థిని, విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం చిప్పగిరిలో ఆర్డిటి ఎటిఎల్ హనుమంతప్ప, సిఓ తిప్పె స్వామి ఆధ్వర్యంలో ఎస్సీ కాలనీ వాసులు, జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వైద్య విద్యార్థిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని, మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని ఫ్లే కార్డు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బస్టాండ్ నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం చేపట్టారు. కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, ఆర్డిటి ఎటిఎల్ హనుమంతప్ప, కౌంటు గోవింద, సిఓ తిప్పేస్వామి మాట్లాడుతూ మహిళలను గౌరవించాల్సింది పోయి వైద్య విద్యార్థిని అత్యంత హింసించి చిత్రహింసలకు గురిచేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. వైద్యులను దేవుళ్లతో సమానంగా చూడాల్సిన వారు వారిపై అఘయిత్యం చేయడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు ఆర్డిటి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కళాశాల లెక్చరర్లు, ఆర్డిటి సిబ్బంది నారాయణస్వామి, లక్ష్మన్న, మల్లేష్ పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రదర్శన

వైద్య విద్యార్థిని హత్య చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-ఆస్పరి

కోల్‌కత్తాలో వైద్య విద్యార్థి మౌమితపై అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రవి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జడ్‌పిహెచ్ స్కూల్ నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్, కోల్‌కత్తాలోని ఆర్‌జికార్ వైద్యశాలలో విధుల్లో ఉన్న వైద్య విద్యార్థినీ హత్యకు కారణమైన దుండగులను ఉరి తీయాలని కోరారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఒక్క చట్టాన్ని తీసుకురావాలని పేర్కొన్నారు. మహిళలపై అగైత్యానికి పాలబడాలంటే భయపడే విధంగా చట్టాన్ని తీసుకు రావాలన్నారు. ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి తరుణ్ తేజ్, అధ్యక్షులు మహేంద్ర, నాయకులు సంతోష్,మహేష్, అంజి పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి-చిప్పగిరి: స్లాప్‌వేసే వరకు నిర్మించి నిలుపుదల చేసిన లబ్ధిదారులందరూ కూడా వెంటనే పూర్తి చేయాలని హౌసింగ్ అధికారి కృష్ణ కుమార్ లబ్ధిదారులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని నంచర్ల లోఇంటి నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ ఈ నాలుగు నెలల కాలంలో నిర్మాణాలు నిలుపుదల చేసిన వారందరూ కూడా పూర్తిచేసిన పక్షంలో వారందరికీ కూడా త్వరగా బిల్లులు అందేలా కృషి చేస్తామన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ భారతి పాల్గొన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగులు- గ్రామాల్లో లోపించిన పారిశుధ్యం

- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గ్రామాలు, పట్టణాల్లో అపరిశుభ్రత పేరుకుపోవడంతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ప్రజలకు విష జ్వరాలు ప్రబలడంతో ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. దగ్గు, జలుబుతో పాటు ఇతర లక్షణాలు ఉండడంతో అనేక మంది ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. పెద్దహరివాణం, పెద్దతుంబలం పిహెచ్‌సి ఓపిల్లో వందల సంఖ్యలో జ్వర పీడితులు ఉంటున్నారు. జనరల్ ఆస్పత్రిలో రోజూ వందల సంఖ్యలో ఓపి పెరిగిపోతున్నట్లు వస్తుండగా, అందులో సుమారు 30 మంది జ్వర లక్షణాలు ఉన్న వారేనని వైద్యులు పేర్కొంటున్నారు.

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం లోపిస్తుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. పల్లెలతో పాటు పట్టణాల్లోనూ ఇంటింటి నుంచి చెత్త సేకరణ రెగ్యులర్‌గా జరగడం లేదు. సిబ్బంది కొరత, నిధుల లేమితో ఆయా పనులు నామమాత్రంగా సాగుతున్నాయి. దోమలు విజృంభిస్తుండడంతో విష జ్వరాలు, టైఫాయిడ్, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. చాలా చోట్ల జ్వరాలతో బాధపడుతున్న వారంతా ప్రయివేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకుంటున్నారు. అక్కడి వైద్యులు డెంగీ లక్షణాలున్నట్లు అనుమానించి పరీక్షలు చేయించడంతో డెంగీ నిర్ధారణ అవుతోంది. బాధితులకు వైద్యం అందిస్తున్నారు. ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయంటూ ప్రయివేట్ ఆస్పత్రుల్లో అడ్డగోలుగా దోచుకుంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరమొచ్చిందని ప్రయివేట్ ఆస్పత్రికి వెళ్తే చాలు అన్ని పరీక్షలూ చేసి, రూ.వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారని పేర్కొంటున్నారు.

అపరిశుభ్ర వాతావరణంతో

పల్లె, పట్టణమనే తేడా లేదు. అంతటా పారిశుధ్య సమస్య నెలకొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారాయి. పట్టణాల్లో డ్రెయినేజీలు అధ్వానంగా



మారాయి. పంచాయతీల్లో నిధుల సమస్యతో కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు తమ జేబుల్లో నుంచి డబ్బులు పెట్టుకోలేమంటూ చేతులెత్తేశారు. సమస్యలు పరిష్కారం కాలేదు. పట్టణాల్లోనూ పారిశుధ్య సమస్య తీవ్రమవుతోంది. సిబ్బంది కొరతతో చెత్త సేకరణ జరగడం లేదు. ప్రజలు చెత్తను తెచ్చి రోడ్ల మీద పడేస్తున్నారు.

సీజనల్ వ్యాధులు వచ్చేదిలా..!

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం పడకేసి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. మరోపక్క పల్లెలు అంతర్గత రోడ్లు, బురదమయం కావడం, డ్రెయినేజీ కాల్వలు లేకపోవడంతో వర్షపు నీరు రోడ్డుపైకి వచ్చి దుర్వాసన వెదజల్లుతోంది. దీనికి తోడు గుంతలమయమైన రోడ్లలో మురుగునీరు నిలిచి దోమలు విపరీతంగా పెరిగిపోయాయి. మరోపక్క చెత్తాచెదారం, దుర్గంధం ఉన్న ప్రదేశాల్లో ఎక్కువగా దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయి. కొబ్బరి బొండాలు, కూలర్లలో నిల్వ ఉన్న నీటి ద్వారా ఎక్కువగా దోమలు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. గ్రామాల్లో దోమల నివారణ కోసం ఫాగింగ్ కూడా చేయడం లేదు. వరుసగా కురుస్తున్న వర్షాలతో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులను అంతంతమాత్రంగానే చేపట్టడంతో గ్రామాల్లో చెత్త పేరుకుపోయింది. వాతావరణంలో జరుగుతున్న మార్పులతో ప్రజలు జ్వరాల బారినపడుతున్నారు.

దోమల మందు పిచికారి చేయాలి

- స్వామి, గ్రామస్తుడు



వరుసగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని సైడ్ కాలువలు, కుంటల్లో నీరు నిలిచిపోయింది. ఆయా ప్రాంతాల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అధికారులు గ్రామాల్లో దోమల నివారణ మందును పిచికారి చేయాలి. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలి.

అప్రమత్తత అవసరం

- డాక్టర్ ఇమ్రాన్, ప్రభుత్వ వైద్యాధికారి



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వాడిన కొబ్బరి బొండాలను దూరంగా పడేయాలి. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో పాటు వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. ఏమాత్రం అలసట అనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

రూ.50 లక్షలతో పరిమళ స్కూల్ ఆధునీకరణ

-మధ్యాహ్న భోజనం ఏర్పాటు యోచన -రూ.2 లక్షలతో విద్యార్థులకు క్రీడా సామాగ్రి

-ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరాలి-పాఠశాల సిబ్బందికి జీతాలు పెంపు

-పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు

ప్రజాశక్తి-మంత్రాలయం

శ్రీ రాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీ పరిమళ విద్యానికేతన్‌ను శ్రీ మఠం నుండి రూ.50 లక్షలతో ఆధునీకరణ చేసిన నేపథ్యంలో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు పరిశీలించారు. సోమవారం పాఠశాల కరస్పాండెంట్ సురేష్ కోనాపూర్ తో కలిసి పాఠశాలకు చేరుకున్న వారిపై పాఠశాల విద్యార్థులు పూల వర్షం కురిపించారు. డప్పు వాయిద్యాలతో, పుష్పాభిషేకంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ గురువు కాలంలో నిర్మించిన పరిమళ పాఠశాలను రూ.50 లక్షలతో ఆధునీకరించామని తెలిపారు. ప్రస్తుతం నర్సరి నుంచి 10 వ తరగతి వరకు 6 వందల మంది విద్యార్థులు పాఠశాలో చదువుతున్నారని చెప్పారు. సుజయీంద్ర జూనియర్ కళాశాల కూడా ఇక్కడే ఉందని, డిగ్రీ కళాశాల ఏర్పాటు యోచనలో ఉన్నట్లు పేర్కొన్నారు. కళాశాల నుండి ఓపెన్ టెన్త్, ఇంటర్‌లకు అనుమతులు వచ్చాయని, అవసరం ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అయినా పరిమళ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఇలాంటి ఓపెన్ టెన్త్ ఓపెన్ ఇంటర్‌లు అవసరం లేదని చెప్పారు. కులమతాలకు అతీతంగా నిర్వహించు పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని, చక్కని విద్యతో పాటు క్రీడలను ప్రోత్సాహించేందుకు క్రీడా సామాగ్రికి రూ.2 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పాఠశాల సిబ్బందికి కూడా శ్రీ మఠం సిబ్బందితో సమానంగా జీతాలు చెల్లించాలని నిర్ణయించామని మహా రథోత్సవం రోజు వెళ్ళడిస్తామన్నారు. విద్యార్థులు మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల ఎఒ ఈరన్న ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు నాగలక్ష్మి వనశ్రీ, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్ర , సిబ్బంది సురేష్, మధుసూదన్ రావు, రాఘవేంద్ర, హనుమేష్, ప్రహ్లాద, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



-పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులకు సాదర స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

శ్రీ మఠంలో బృందావనం స్వర్ణమయం

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనం ఇచ్చారు. సోమవారం రాఘవేంద్రస్వామి సప్త రాత్రోత్సవాల సందర్భంగా రాఘవేంద్రుని బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో పట్టు వస్త్రాలతో వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని నైవేద్య సమర్పణలో మంగళ హారతులు ఇచ్చారు.



సిఐను కలిసిన నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ



దేవనకొండ అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ కు నందికొట్కూరు నుండి బదిలీపై వచ్చిన సీఐ విజయ భాస్కర్‌ను పలువురు టిడిపి నాయకులు, వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. మండల టిడిపి కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, సీనియర్ నాయకులు ఉచిరప్ప, రామారావు నాయుడు, మల్లయ్య, టిడిపి నాయకులు చిట్యాల రామాంజనేయులు, వల్లే వెంకటేష్ (కొండన్న), డీలర్ రంగడు, ప్రభాకర్, వైసిపి నాయకులు ఎంపిటిసి తపాల శ్రీనివాసులు, గుండ్లకొండ సర్పంచ్ కుమారుడు గఫూర్, గుమ్మరాళ్ళ వైసిపి నాయకులు నరసింహస్వామి, కొత్తపేట బాబులు మర్యాదపూర్వకంగా కలసి పూలమాలలతో, దుశ్శాలలతో సన్మానించారు.

పాఠశాల తరలింపు ఆదేశాలు వెనక్కు తీసుకోవాలి

- స్థలం కేటాయించి భవనం నిర్మించాలి :ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - ఆలూరు : ఆలూరు గిరిజన గురుకుల బాలికల పాఠశాల తరలింపు ఆదేశాలను అధికారులు వెనక్కి తీసుకొని, పాఠశాలకు స్థలం కేటాయించి భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మండల ఉపాధ్యక్షుడు గోవర్ధన్ అధ్యక్షత వహించారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైన, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గిరిమూర్తి మాట్లాడుతూ ఆలూరులో ఉన్న ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ 2016లో బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలోని మరో భవనంలోని కొన్ని గదులలో తాత్కాలికంగా ప్రారంభించారన్నారు. ఇందులో ప్రస్తుతం నెరణికి తాండ, అరికెర తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన 297 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. మంచి ఉత్తీర్ణత సాధించడంతో ట్రిబుల్ ఐటీ సీట్లు కూడా పొందారని తెలిపారు. ఏసియా వరల్డ్ బుక్ ఆఫ్ 32 రికార్డులు సాధించారని చెప్పారు. ప్రస్తుతం బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల, బాలికల గిరిజన గురుకుల పాఠశాల ఈ రెండు పాఠశాలలు ఒకే కాంపౌండ్‌లో ఉండడం కారణంతో సమస్యగా మారిందని, బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో వేరే ప్రాంతానికి మార్చాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ శాఖ ఉత్తర్వులు ఆదేశాలను ఇవ్వడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నా రన్నారు. పాఠశాల తరలింపు ఆదేశాలు అధికారులు వెనక్కి తీసుకొని ఆలూరులో కొనసాగించి గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు స్థలం కేటాయించి భవనాలు నిర్మించాలన్నారు. అనంతరం మండల తహశీల్దార్ గోవింద్ సింగ్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ శంకర్ నాయక్,వైస్ చైర్మన్ లెక్కె నాయక్ తల్లిదండ్రులు అమరేష్ నాయక్, రాజేష్ నాయక్, కృష్ణ నాయక్, లక్ష్మీబాయి, గుణ బాయి, జ్యోతి బాయి, ఎస్ఎఫ్ఐ నాయకులు జగదీష్, వన్నూర్ వలి, రాజశేఖర్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం విరాళాల సేకరణ

ప్రజాశక్తి - దేవనకొండ : కేరళలోని వయనాడులో సంభవించిన వరద బీభత్సం నేపథ్యంలో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం జరిగిన సందర్భంగా బాధితులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు దేవనకొండ మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విరాళాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు వీరశేఖర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో సహకరించిన ప్రతి ఒక్కరికి మండల కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు పేర్కొన్నారు. సేకరించిన రూ. 11957 మొత్తం ం రాష్ట్ర సిపిఎం పీపుల్స్ రిలీఫ్ ఫండ్‌కు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు యూసుఫ్ బాషా, అశోక్, మహబూబ్ బాషా, సూరి, సీనియర్ నాయకులు బజారి లక్ష్మిరెడ్డి, వై పెద్దయ్య నాయుడు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్షా బంధన్

ప్రజాశక్తి - ఆదోని : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చి మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకురాలు హుస్నాబాను డిమాండ్ చేశారు. సోమవారం రక్షాబంధన్ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ మహిళా నాయకురాలు కవిత, శిరీష, హసీనా భాను ఆదోని డీఎస్పీ డి సోమన్న, ట్రైనింగ్ డిఎస్పి ధీరాజ్, ఇన్‌ఛార్జ్ సబ్ కలెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్‌లకు రాఖీ కట్టారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు గౌస్, శశిధర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

ప్రజాశక్తి-ఆదోని

ప్రజల నుంచి స్వీకరించిన అర్జీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ (ఇన్‌ఛార్జ్), స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయా మండలాల్లోని అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ సమస్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయపు పరిపాలన అధికారి వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వాయర్ వేణు సూర్య, శ్రీనివాస రాజు, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఆర్‌డిఒ నాగేంద్ర, డిప్యూటీ డిఎంహెచ్ ఒ. సత్యవతి, ఉప తహశీల్దారు పెద్దయ్య, వలిబాష, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్

ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి- కౌతాళం : మండలంలో ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఆధార్ సెంటర్లు లేకపోవడం వల్ల విద్యార్థులు, చిన్న పిల్లలు, ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రోజుల తరబడి తిరిగి ఆధార్ కార్డుల కోసం వ్యయ ప్రయాసలు ఎదుర్కొంటున్నారని, ఇప్పటికైనా రాజకీయ నాయకులు, అధికారులు జోక్యం చేసుకొని మండల ప్రజలను దృష్టిలో ఉంచుకొని అన్ని సచివాలయాల్లో ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయడానికి కృషి చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి ఈరన్న, ఉలిగయ, వీరేష్ పాల్గొన్నారు.

హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేసి సాగునీరు ఇవ్వాలి

- వ్యకాసం, రైతు సంఘం

ప్రజాశక్తి - దేవనకొండ : మండలంలో పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా కాలువ పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేసి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సాగు నీరు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బి వీర శేఖర్, రైతు సంఘం నాయకులు శ్రీరాములు డిమాండ్ చేశారు. హంద్రీనీవా పెండింగ్ పనులు పూర్తి చేయాలని సోమవారం తహశీల్దార్ కార్యాలయం ముందు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతు సంఘం మండల కార్యదర్శి సూరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ హంద్రీనీవా పనులు ఏళ్ల తరబడి పెండింగ్లో కొనసాగుతున్నాయని మండలంలో వర్షాభావ పరిస్థితులు వచ్చినప్పుడల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని పదేపదే ప్రభుత్వం, అధికారుల దృష్టికి తెచ్చినా స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ అధికారులు మాత్రం మండలానికి 46 వేల ఎకరాలకు సాగు నీరుస్తామని ఇస్తున్నామని డాంబికలు పలుకుతున్నారని ఆచరణలో మాత్రం మొక్కుబడిగా సాగునీరు సౌకర్యం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ రైతుల బాధలు గ్రహించి కప్పట్రాళ్ల దగ్గర మరియు పాలకుర్తి, తెర్నేకల్, కరివేముల మధ్య ఉన్నటువంటి కాల్వపనులు పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాసం మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాషా, బజారి, మండల కార్యదర్శి మహబూబ్ బాషా, రైతు సంఘం నాయకులు లక్ష్మిరెడ్డి, సుంకన్న, జయరాముడు, మహేంద్ర, రాముడు, జయన్న, రైతులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని హత్య చేసిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి-ఆదోని

కోల్‌కతా పీజీ ట్రైనీ వైద్యురాలి అత్యాచార, హత్య ఘటనకు వ్యతిరేకంగా ఆదోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో మహిళా లోకం కదం తొక్కారు. టిడిపి రాష్ట్ర కార్యనిరవాహక కార్యదర్శి గుడిసె అది కృష్ణమ్మ, ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, ఎన్‌జిఒస్ అధ్యక్షురాలు ఉషారాణి, శ్రీలక్ష్మి మనెమ్మ, సుగ్గనమ్మ, శాంతి, జిలేకానిబి, హెల్త్ సూపర్‌వైజర్ మేరీ, మహిళ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేసులో పశ్చిమ బెంగాల్ వైఫల్యం, పోలీసులు నిర్లక్ష్యంపై కలకత్తా హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిందన్నారు. ఈ కేసును హైకోర్టు సిబిఐకి అప్పగించిందన్నారు. ఈ కేసులో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. కేసును ఎందుకు బెంగాల్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆర్‌జికార్ ఆస్పత్రిపై దుండగుల దాడి, క్రైమ్ సీన్‌లో సాక్ష్యా ధారాలను ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారని ఆరోపించారు.

ర్యాలీకి కాంగ్రెస్ మద్దతు: మహిళా డాక్టర్ హత్య ఘటన నిరసిస్తూ మహిళా సంఘాల నాయ కులు చేపట్టిన ర్యాలీకి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రమేష్ యాదవ్ సంఘీభావం తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకొని మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడులు అఘాయిత్యాలను నిరోధించేందుకు చట్టాలు కఠిన తరం చేయాలని డిమాండ్ చేశారు.

నోబెల్ ఒకేషనల్ కాలేజ్ ఆధ్వర్యంలో: హత్య ఘటనను నిరసిస్తూ ఆదోని పట్టణంలోని నోబుల్ ఒకేషనల్ కాలేజ్ విద్యార్థులు పట్టణంలోని బీమాస్ కూడలిలో కరస్పాండెంట్ సంగటి దేవదానం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. అక్కడ రాస్తారోకో నిర్వహించి మహిళలపై జరుగుతున్న దాడులు అఘాయిత్యాలను నిర్మూలించే దిశగా చట్టాలను బలోపేతం చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మద్దతు డాక్టర్ హత్య ఘటనను నిరసిస్తూ మహిళా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీకి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు వివిధ విద్యార్థి సంఘాల నాయకులు బిడిఎస్ఎఫ్ రమేష్, ఎఐఎస్ఎఫ్ సాబీర్, డిఎస్ఎఫ్ దానపురంఉదయ్, పిడిఎస్ఒ తిరుమలేశా విద్యార్థులు మద్దతు ప్రకటించారు.

పోలీసులతో వాగ్వాదం: మహిళలు విద్యార్థులు చేపట్టిన ర్యాలీ ఉద్రిక్తతకు దారితీసింది సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు చేరుకోగానే వినతి పత్రం సబ్ కలెక్టర్ ఇస్తామని కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న టూ టౌన్ పోలీసులు వారిని అటకాయించడంతో వాగ్వి వాదం చోటుచేసుకుంది. పోలీసులకు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల నాయకులు నినాదాలు చేయడంతో ఆ ప్రాంతం హోరెత్తింది. కార్యక్రమంలో హెల్త్ ఉద్యోగులు మెప్మా ఉద్యోగులు సచివాలయం ఉద్యోగులు విద్యార్థులు ఉన్నారు.



మాట్లాడుతున్న గుడిసె ఆది కిష్టమ్మ